మత్తు వీడు.. భవిష్యత్ చూడు!

● చిన్నచిన్న విషయాలకే యువత మధ్య గొడవలు ● చెడు వ్యసనాల ఊబిలో విలవిల ● హిల్స్ ప్రాంతాల్లో పెరుగుతున్న ఘర్షణలు ● తల్లిదండ్రులు బాధ్యత వహించాలి

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో యువకుల మధ్య తలెత్తుతున్న చిన్నచిన్న వివాదాలు చినికిచినికి గాలివానగా మారి ఘర్షణలకు దారితీస్తున్నాయి. అసూయ, ఈర్ష్య, ద్వేషం, మితిమీరిన ఫ్యాషన్, పబ్‌కల్చర్ ఊబిలో పడి యువతరం విలవిలలాడుతోంది. ఈ క్రమంలో చోరీలు, దోపిడీలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఇవి కొన్ని పోలీసుస్టేషన్‌కు చేరుతుండగా మిగతావి మధ్యవర్తుల సమక్షంలోనే సర్దుకుంటున్నాయి. చక్కని భవిష్యత్ కోసం ఆరాటపడాల్సిన కొందరు యువత చెడు వ్యసనాల బాట పడుతున్న తీరుపై ప్రత్యేక కథనం..

బంజారాహిల్స్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): యూత్ అంటే జోష్, సరదాలు, సంతోషాల సంగమం, కాస్త కలివిడిగా.. ఇంకాస్త హడావిడిగా నిత్యం ఉల్లాసభరితంగా ఉండటం సైజం. ర్యాష్‌గా బైక్ నడపాలన్నా, రేసింగ్‌లతో అందర్నీ ఆకట్టుకోవాలన్నా వారికే చెల్లు. కానీ ఈ సరదాలు, సంతోషాల మాటునున్న మత్తు విపరీత పోకడలకు కారణమవుతున్నది. ఫలితంగా అసూయ, ద్వేషం, అక్కసు వారి మదిలో తొంగి చూస్తున్నాయి. ఇవే అడ్డదారులు తొక్కేందుకు కారణమవుతున్నాయి. ఇది ఎంతవరకు అంటే.. చిన్న విషయాలకే గొడవలకు దిగేటంత. ఇలాంటి పంచాయితీలు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో తరచూ చోటుచేసుకుంటున్నాయి. యూత్‌లో ఏర్పడుతున్న ఈ వైఖరికి చరమగీతం పాడాలంటే సమస్యకు మూలాలను గుర్తించాల్సిందేనని అంటున్నారు మానసిక నిపుణులు.

అసూయ, ద్వేషం

అసూయ, ద్వేషం... ఈ రెండూ యువతపై ప్రభావం చూపే అంశాలు. మారుతున్న పోకడల నేపథ్యంలో లేనిపోని అలవాట్లకు దారితీస్తున్నాయి. వీరి మనస్తత్వాలను గుర్తించడంలో తల్లిదండ్రులు చూపుతున్న అజాగ్రత్త సైతం వీరి భవితపై తీవ్రప్రభావం చూపుతోంది. ఫలితంగా యువత మానసిక సమస్యలకు గురవుతోంది. చక్కని భవిష్యత్ కోసం ఆరాటపడాల్సిన కొందరు యువత జలసీకి దారితీసే ఆలోచనల బారిన పడుతున్నారు. ఇలాంటి వారు ఎప్పుడు చూసినా ఏవేవో నష్టం చేకూర్చే ప్రణాళికలేస్తూ, గొడవలను సృష్టిస్తూ, సమస్యలను కొనితెచ్చు కుంటున్నారు. వికృతచేష్టలు చేస్తుంటారు. ఆరు నెలల క్రితం పబ్‌లో తలెత్తిన ఓ వివాదంలో బీటెక్ విద్యార్థులు రెండు జట్లుగా విడిపోయి, జూబ్లీహిల్స్‌లో బీరు బాటిళ్లతో దాడులకు పాల్పడ్డారు. ఇది జరిగిన కొద్ది రోజులకే మరో పబ్‌లో గొడవ జరిగింది. ఓ అమ్మాయి విషయంలో బంజారాహిల్స్‌లోని ఎంబీఏ విద్యార్థుల మధ్య ఘర్షణ తలెత్తింది. పూర్వ, ప్రస్తుత విద్యార్థులు హాకీస్టిక్‌లతో దాడులు చేసుకున్నారు. అయితే పోలీసులు సకాలంలో చేరుకుని ఇరువర్గాల వారిని అరెస్టు చేశారు.



గెలుపు కోసం ఆరాటం..

పరిసరాలు, సహచరుల కారణంగా యువత మనస్తత్వం మారుతూ ఉంటుంది. కొన్నిసార్లు జన్యుపరమైన మార్పులు ఇందుకు తావిస్తాయి. తోటి వారికి ఉన్న దుస్తులు, సెల్‌ఫోన్లు, ఖరీదైన బైకులు, గృహాలంకరణ వస్తువులు తమకూ ఉండాలని వాటిని ఎలాగైన సాధించాలని తలపోస్తుంటారు. ఈ క్రమంలో అది సాధ్యం కాక....ఈ వస్తువులున్న వారిపై అసూయ పెంచుకుంటారు. తాము ఓడిపోయామన్న భావన వారిలో కసికి, అసూయకు తావిచ్చే ప్రమాదముంది. అదిలోనే తన పరిస్థితి ఏంటో, తాను పెరిగిన వాతావరణం ఏమిటో తెలుసుకుని మసలుకుంటే అంతా బాగానే ఉంటుంది. కానీ.. సమీక్ష లేకపోవడంతో సమస్యంతా వస్తుంది. ఈ క్రమంలో చోరీలు, దోపిడీలు చేసి అయినా అనుకున్నది సాధించాలన్న పట్టుదల అంతర్లీనంగా వారిలో బయల్దేరుతుంది. ఒకట్రెండుసార్లు ఇలాంటి పనులుచేసిన తర్వాత... తమకు తాము ఎక్కువగా ఊహించుకుంటూ మరింత రెచ్చిపోతారు. హిల్స్ పరిధుల్లో ఈ మధ్య బీటెక్ చదివిన కుర్రాళ్లు తమ విలాసాల కోసం సెల్‌ఫోన్ దగ్గర్నుంచి బంగారు గొలుసులను స్నాచింగ్ చేయడం మొదలు పెట్టారు. వచ్చిన డబ్బుతో పబ్‌ల్లో గడుపుతున్నారు. ఇలా ఏడాదికాలంగా చోరీలకు పాల్పడుతున్న 8 మంది బీటెక్ విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు.



ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకుడు (ఫైల్)

కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు లేదు..

చిన్న విషయాలకే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి విషయంలో పోలీసులు ముందు నుంచే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు వీరిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తల్లిదండ్రులకు కూడా నచ్చచెబుతున్నారు. కానీ యువకులు మాత్రం గొడవల జోలికి వెళ్లడం మానడం లేదు.

అతి స్వేచ్ఛ ముప్పునకు దారితీస్తోంది

పిల్లలు తరుచూ గొడవలకు దిగుతుండటంతో తల్లిదండ్రులు కౌన్సెలింగ్ కోసం మా దగ్గరికి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో అతి స్వేచ్ఛ విధ్వంసకర పరిస్థితులకు దారితీస్తుందని చాలా కేసుల్లో తేలింది. పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ కొంత మేరకే ఉండాలి. తప్పు చేశారు అని తెలియగానే దాని పర్యవసానం ఎలా ఉంటుంది అనేది తల్లిదండ్రులు పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. అప్పుడు పిల్లలు జాగ్రత్తగా ఉంటారు. చాలా మంది తల్లిదండ్రులు ఖరీదైన వాహనాలు కొనిచ్చి ఇక తమ పనయిపోయిందని భావిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ఈ వాహనాలతో స్నేహితులతో కలిసి పిల్లలు ఏం చేస్తున్నారు అనే విషయాన్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తుండాలి. తప్పటడుగులు పడకుండా మొదట్లో తగిన విధంగా జాగ్రత్తలు వహిస్తే పిల్లల భవిష్యత్ మెరుగ్గా ఉంటుంది.

- డాక్టర్ సుఖాకర్, సైకాలజిస్ట్



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బాబా

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

బోరబండ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ సూచించారు. మంగళవారం సైట్-2 కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీల్లో వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. కురుస్తున్న వర్షాలకు శిథిలమైన స్తంభాలను గుర్తించాలని, తొలగించడానికి ప్రతిపాదనలను పంపించాలని అన్నారు. బస్తీల్లో చెత్త తరలింపులో నిర్లక్ష్యం వీడి ఎప్పటికప్పుడు జాగత్తగా ఉండాలని చెప్పారు. అనంతరం మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కార్యకర్తలతో కలసి కార్పొరేటర్ వెళ్లి ఆయనకు ఔషధ మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మల్లికార్జున్, నసీరుద్దీన్, చంటి, నరేష్, విశ్వపతితో పాటు ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

యునాని హెల్త్ క్యాంప్‌నకు మంచి స్పందన



యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ చర్మవ్యాధుల యునాని వైద్య పరిశోధనల సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ క్లినికల్ రీసెర్చ్ ప్రోగ్రామ్ కింద మంగళవారం నిర్వహించిన ఉచిత యునాని వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. రహ్మత్‌నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్‌హిల్స్ వీజేఆర్ దేవాలయం సమీపంలో మొబైల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి పలు బస్తీల నుంచి రోగులు పెద్ద ఎత్తున వచ్చి, వైద్య సలహాలను, మందులను ఉచితంగా పొందారు. రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ రాజారామ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం పలు ప్రాంతాలలో వారానికి ఐదు రోజులు నిర్వహిస్తున్నామని, బస్తీలలో, ప్రభుత్వ పాఠశాలల్లో మొబైల్ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

బేగంపేటలో సీవరేజీ సమస్యను పరిష్కరించాలి



వాటర్ వర్క్స్ జీ.ఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న సీవరేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని వాటర్ వర్క్స్ జీఎంను బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ మంగళవారం జీఎంకు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా కుందన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మురుగునీరు రైల్వేస్టేషన్ పట్టాల కిందగా బ్రాహ్మణవాడి ప్రాంతానికి రావడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని, పీఎఫ్ క్వార్టర్స్ సమీపంలోని ఇళ్ల వద్ద నిత్యం మురుగునీరు నిలుస్తోందని అన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు.



సభ్యత్వ నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కోటి బీజేపీ సభ్యత్వాలు చేయించాలి : చింతల

బంజారాహిల్స్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి బీజేపీ సభ్యత్వాలను చేయించాలని కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన మంగళవారం ప్రారంభించారు. స్వయంగా స్థానికులను కలిసి పార్టీ సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సభ్యత్వాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి, నీరజ, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో కమ్మ సంఘం ప్రతినిధులు

అందరికీ ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

అమీర్‌పేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కమ్మ సంఘం ఆధ్వర్యంలో కులాలకు అతీతంగా అందరికీ ఉచితంగా కంప్యూటర్ బేసిక్స్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధానకార్యదర్శి మేకా రామకృష్ణ అన్నారు. అమీర్‌పేట కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ ద్వారా కంప్యూటర్ బేసిక్స్‌లో 60 రోజులుగా ఉచిత శిక్షణ తీసుకున్న 65 మంది అభ్యర్థులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తదుపరి బ్యాచ్ అభ్యర్థుల ఎంపికకు ఇంటర్వ్యూలను అక్టోబర్ 8, 9వ తేదీ మధ్యాహ్నం 2-30 గంటల నుంచి కమ్మసంఘం కార్యాలయంలో జరుగుతాయన్నారు. ఎంపికైన వారికి అక్టోబర్ 14 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గలవారు వచ్చేనెల 7వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9849566945, 9177661161 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధనలు అందించాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ అనుదీప్

హైదరాబాద్‌సిటీ / బేగంపేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన బోధనలు అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులకు సూచించారు. ఖైరతాబాద్ మండలం సోమాజిగూడలోని ఎంఎస్ మక్తా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కమ్యూనిటీ హాల్‌ను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తగిన మౌలికవసతులు కల్పిస్తున్నామన్నారు. కాగా, ఎంఎస్ మక్తా పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు ఒకే చోట తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియాలు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాతపాఠశాల స్థలంలో అన్ని హంగులతో నూతన భవన నిర్మాణం చేపట్టే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణి, ఈఈ షఫీమియా, ప్రైమరీ, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు మహమూద్‌అలీ, గయాసోద్దీన్, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ పటాలంలో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌లో క్రీడాకారులను అభినందిస్తున్న కమాండెంట్ పి.మురళీకృష్ణ

ఘనంగా యాన్యువల్ స్పోర్ట్స్ మీట్

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ ప్రథమ పటాలం(టీఎస్ఎస్పీ)లో మంగళవారం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. పటాలం కమాండెంట్ పి.మురళీకృష్ణ ఈ క్రీడలను ప్రారంభించారు. పటాలంలోని వివిధ విభాగాల పోలీసు సిబ్బంది కీడల్లో పాల్గొని సందడి చేశారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ రోజువారీ దినచర్యలో క్రీడలు, వ్యాయామం తప్పక ఉండేలా చూసుకోవటం పోలీసులకు ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, అప్పారాయ్, భాస్కర్, ఆర్ఐలు సురేష్, ధర్మారావు, సాంబయ్య, శంకర్, రాజేష్, శ్యామ్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.10 లక్షలు అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ విజయ్‌కుమార్

అమీర్‌పేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలో ఉన్న ప్రముఖ ఐజెంట్ ఫార్మాడ్రగ్ రీసెర్చ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శ్రీనివాస్‌వర్మ రుద్రరాజు, అతని కుమార్తె, కంపెనీ డైరక్టర్ సౌమ్య రుద్రరాజు కమ్యూనిటీ సీసీకెమెరాల ఏర్పాటుకు రూ.10 లక్షల చెక్కును సోమవారం ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం దాతలు ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ రూ.10 లక్షలతో బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లకు ట్రైనీ ఎస్ఐల నియామకం

బంజారాహిల్స్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మండలంలోని పోలీస్‌స్టేషన్‌లకు ట్రైనీ ఎస్ఐలను నియమించారు. అప్పాలో శిక్షణ పొందిన ఎస్ఐలకు ఫీల్డ్ శిక్షణలో భాగంగా పలు ఠాణాలను కేటాయించారు. ఆయా ట్రైనీ ఎస్ఐలు మంగళవారం రిపోర్ట్ చేశారు. జూబ్లీహిల్స్‌కు తోట అనూష, ఆర్.రాజు, షేక్‌వాజీద్, బంజారాహిల్స్‌కు సుష్మ, కార్తిక్, రఘురాంరెడ్డి, శివరాజు, ఫిలింనగర్‌కు రవికుమార్, శ్రీశైలం, హరీష్‌కుమార్, పంజాగుట్ట నిఖిత్‌కుమార్, వెస్లీ, తులసీ, రమ్య, సంజీవరెడ్డినగర్‌కు వై.కృష్ణ, శివకృష్ణ, మధురానగర్‌కు ప్రవీణ్‌కుమార్, రంజీత్‌నాయక్, బోరబండకు చందన, రాకేష్‌లు నియమితులయ్యారు.



జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డిని కలిసి బాధ్యతలు స్వీకరిస్తున్న ట్రైనీ ఎస్ఐలు

ఎస్సీ వర్గీకరణకు అనుకూలమా, వ్యతిరేకమా?

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పాలి
- లేకుంటే మాలల ద్రోహిగా ప్రకటించి, ఇళ్లు ముట్టడిస్తాం
- వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ చెన్నయ్య



అభివాదం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

పంజాగుట్ట, సెప్టెంబర్24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎస్సీ వర్గీకరణకు అనుకూలమా, వ్యతిరేకమా అనేది స్పష్టం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి రాష్ట్ర మంత్రి కాదని, మంత్రివర్గ ఉప సంఘం నుంచి వెంటనే వైదొలగాలని, లేకపోతే ఆయనను మాలల ద్రోహిగా ప్రకటిస్తాం, ఇంటిని ముట్టడిస్తాం అని సమితి కన్వీనర్ జి.చెన్నయ్య హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి కో కన్వీనర్లు బేర బాలకిషన్, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్ బాబు, నాను, తాలుక అనిల్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీని వెంటనే రద్దు చేసి, సిట్టింగ్ జడ్జీతో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెబ్ సైట్‌లో పెట్టాలన్నారు. మంద కృష్ణ మాదిగ ప్రధాని మోదీని ఒప్పించి దేశవ్యాప్తంగా కులగణన చేయించాలని అన్నారు. మల్లు రవి.. మంత్రి దామోదర రాజనర్సింహలా స్పష్టమైన వైఖరిని అర్ధరాత్రి 12 గంటలలోగా ప్రకటించాలని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు భైండ్ల శ్రీనివాస్, భంగి ఆనంద రావు, పొట్ల మధుకర్, కె.ఎల్లస్వామి ఆకాశ్, చేతన్, తదితరులు పాల్గొన్నారు.



ఎం.ఎస్ మక్తాలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ అనుదీప్

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి: కలెక్టర్

బేగంపేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కషి చేస్తామనని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు. సోమాజిగూడ డివిజన్‌లోని ఎం.ఎస్ మక్తాలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న పాఠశాలను అభివృద్ధి చేయాలని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గతంలోనూ పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ విజయారెడ్డి విజ్ఞప్తి చేశారు. దీంతో పాఠశాల అభివృద్ధికి రూ40 లక్షలు నిధులు మంజూరు అయినట్టు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. బస్తీవాసుల సూచనలతో పాఠశాల అభివృద్ధికి ఓ ప్రణాళికను రూపొందించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్ షరీఫ్ పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు, బీఆర్ఎస్ నాయకులు

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి

బౌద్ధనగర్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లో అయిమాత ఆలయం వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, జలమండలి మేనేజర్ ప్రియాంక స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. దాదాపు రూ. 31.50 లక్షలతో రోడ్డు పనులు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు కరాటేరాజు, శైలేందర్, అశోక్, శ్రీనివాస్, మహాత్మా ఉన్నారు.

బేగంపేటలో మురుగు సమస్యను పరిష్కరించాలి

బేగంపేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో ప్రజలు మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సివరేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ టి మహేశ్వరి కోరారు. ఈ మేరకు మంగళవారం వాటర్‌వర్క్స్ జీ.ఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.



వాటర్‌వర్క్స్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

కుందన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మురుగునీరు రైల్వేస్టేషన్ పట్టాల కింద నుంచి బ్రాహ్మణవాడి ప్రాంతంలోకి వస్తున్నదని, పీఏఫ్ క్వార్టర్స్ సమీపంలోని ఇళ్ల వద్ద నిత్యం మురుగునీరు నిల్వ ఉంటుందని జీఎంకు వివరించారు. రెండు నెలల నుంచి బ్రాహ్మణవాడి ప్రాంతంలో మురుగు సమస్య తీవ్రంగా ఉందని, ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు

చిలకలగూడ, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, పుష్పగిరి కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల అద్దాలు అందజేశారు. చిన్న పిల్లలకు తరచూ కంటి పరీక్షలు నిర్వహిస్తుండాలని డాక్టర్లు చందు, యశ్వంత్ సూచించారు. కార్యక్రమమంలో క్లబ్ ప్రతినిధులు లక్ష్మీ, సతీష్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడు కె. మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, నాగశృతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.10 లక్షల చెక్కు అందజేత

అమీర్‌పేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు అమీర్‌పేటలోని ఐజెంట్ ఫార్మా డ్రగ్ రీసెర్చ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శ్రీనివాసవర్మ రుద్రరాజు, అతని కుమార్తె కంపెనీ డైరెక్టర్ సౌమ్యరుద్రరాజు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. మంగళవారం ఎస్ఆర్‌నగర్



డీసీపీ విజయ్‌కుమార్‌కు అందజేసిన 'ఐజెంట్ ఫార్మా' డైరెక్టర్ సౌమ్యరుద్రరాజు

పోలీస్ స్టేషన్‌లో వెస్ట్‌జోన్ డీసీపీ విజయకుమాను కలిసి చెక్కు అందజేశారు. డీసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సౌమ్య రుద్రరాజు అందజేసిన రూ.10 లక్షలతో బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ పాల్గొన్నారు.



సర్టిఫికేట్లు అందుకున్న వారితో కమ్మ సంఘం ప్రతినిధులు

కంప్యూటర్‌లో బేసిక్స్ శిక్షణ పూర్తి చేసుకున్న 65 మందికి సర్టిఫికేట్ల అందజేత

అమీర్‌పేట, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట కమ్మ సంఘం ఆధ్వర్యంలో వయోవృద్ధులు, గృహిణులు, విద్యార్థులకు 60 రోజులపాటు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెసన్‌లో స్టడీస్ ద్వారా కంప్యూటర్ బేసిక్స్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న 65 మందికి సంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ మంగళవారం సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ సంఘం ఆధ్వర్యంలో కులాలకు అతీతంగా ఉచితంగా కంప్యూటర్ బెసిక్స్‌లో శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. తదుపరి బ్యాచ్ అభ్యర్థుల ఎంపికకు ఇంటర్వ్యూలను అక్టోబర్ 8,9వ తేదీ మధ్యాహ్నం కమ్మ సంఘం కార్యాలయంలో జరుగుతాయన్నారు. ఎంపికైన వారికి అక్టోబర్ 14 నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులకు వయోపరిమితి లేదని, 10వ తరగతి ఉత్తీర్ణులైతే సరిపోతుందన్నారు ఆసక్తి గలవారు అక్టోబర్ 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవలన్నారు. వివరాలకు 98495 66945, 91776 61161 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పర్యావరణ హితంగా

- స్వచ్ఛభారత్ పక్షోత్సవం సందర్భంగా పర్యావరణ అనుకూల పద్ధతులు
- రైల్వేస్టేషన్ నిర్వహణలో సరికొత్త ప్రమాణాలు
- క్లీనింగ్ కోసం మూడేళ్లకు రూ.10.5కోట్లతో ప్రైవేటట్ సంస్థలతో ఒప్పందాలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిశుభ్రత

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిశుభ్రత, స్టేషన్ నిర్వహణలో సరికొత్త ప్రమాణాలకు దక్షిణ మధ్యరైల్వే శ్రీకారం చుట్టింది. స్వచ్ఛభారత్ పక్షోత్సవం సందర్భంగా పర్యావరణ హితమైన పద్ధతులను పాటించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రతి యేటా రూ.3.5కోట్ల చొప్పున రానున్న మూడేళ్లకు మొత్తం రూ.10.5కోట్లు ఖర్చు చేయనుంది. ఈ మేరకు పలు ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రోజూ 197 రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా, వాటిల్లో దాదాపు 2లక్షలమంది ప్రయాణికులు దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రణిస్తున్నారు. ప్రయాణికులకు అత్యున్నత స్థాయి సేవలను అందించాలనే లక్ష్యంతో సికింద్రాబాద్ స్టేషన్‌ను పరిశుభ్రతలో ఇతర స్టేషన్లకు ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. స్టేషన్ నిర్వహణలో పర్యావరణ అనుకూల పద్ధతుల్లో బాగంగా విద్యుత్‌ను ఆదా చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. స్టేషన్ లోపల, వెలుపల 100 శాతం ఎల్ఈడీ లైటింగ్, శక్తివంతమైన బీఎల్‌డీసీ ఫ్యాన్లు, స్టార్‌రేటెడ్ ఎయిర్ కండీషన్లు ఏర్పాటు చేశారు. స్టేషన్‌లో నెలకొల్పిన 500కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పవర్‌సిస్టమ్ కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు దోహదపడుతోంది. ఈ తరహా పద్ధతుల వలన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ఇటీవల కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) నుంచి గ్రీన్ రేటింగ్‌లో ప్లాటినం గ్రేడ్ లభించింది.



ఆధునిక యంత్రాలు

క్లీనింగ్ కోసం మెకనైజ్డ్ యంత్రాలు

సికింద్రాబాద్ స్టేషన్‌లో హౌస్‌కీపింగ్ సేవలను మరింతగా ఆధునీకరించారు. రాగ్ పీకింగ్, పెస్ట్ కంట్రోల్, ఎలుకల నివారణ..తదితర పారిశుధ్య పనులకు ప్రైవేటు సంస్థలతో రైల్వే అధికారులు ఒప్పందాలను కుదుర్చుకున్నారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలను శుభ్రపరిచేందుకు రైడ్-ఆన్ స్క్రబ్బర్, డ్రైయర్‌లతో సహా మొత్తం 24యంత్రాలను వినియోగిస్తున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకోసం వాక్ బిహైండ్ స్వీపింగ్ మెషీన్లు, డ్రై-స్విప్ వాష్ రూమ్‌ల నిర్వహణ కోసం వ్యాక్యూమ్ క్లీనర్లు, అద్దాలు, టైల్స్‌ను శుభ్రపరిచేందుకు ఆవిరి యంత్రాలు, చెత్తను షెడ్‌కు తరలించేందుకు ఈ-రిక్షాలను సమకూర్చారు. ఈ సందర్భంగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. ఆధునిక పరిశుభ్రతా పద్ధతుల కోసం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నెలకొల్పిన నూతన ప్రమాణాలు.. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు దోహదపడతాయన్నారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన పరిసరాలను అందించేందుకు ఈ పద్ధతులు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. అధునాతన పద్ధతులను పాటిస్తున్న సికింద్రాబాద్ డివిజన్ అధికారుల బృందాన్ని జీఎం అభినందించారు.



ఆధునిక యంత్రంతో ప్లాట్‌ఫాంను శుభ్రం చేస్తున్న సిబ్బంది

నీటి సంరక్షణ- రీసైక్లింగ్ కార్యక్రమాలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సమర్థవంతమైన నీటి నిర్వహణ వ్యూహాన్ని అవలంబిస్తున్నారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 500కేఎల్‌డీ సామర్థ్యం కలిగిన రీసైక్లింగ్, మురుగునీటి శుద్ధికర్మాగారం నీటి వృథాను అరికడుతోంది. దాంతో జీరో వాటర్ వేస్టేజ్ స్టేషన్‌గా మారింది. స్టేషన్ అంతటా వివిధ అవసరాల కోసం వినియోగించిన నీటిని రీసైకిల్ చేయడం ద్వారా నీటి సంరక్షణలో పురోగతిని సాధించింది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కోసం స్టేషన్‌లో 10 ప్లాస్టిక్ బాటిల్ ష్రెడ్డింగ్ మెషీన్‌లు ఏర్పాటు చేశారు. 26 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నెలకొల్పిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ద్వారా వ్యర్థాలను విభజిస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కంటోన్మెంట్ బోర్డు నామినేటెడు సభ్యుడు రామకృష్ణ

తిరుమలగిరి సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడు సభ్యుడు జే రామకృష్ణ సూచించారు. పరిసరాల శుభ్రత బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఆయన అన్నారు. మంగళవారం తిరుమలగిరి ప్రాంతంలోని బంజారానగర్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని బోర్డు జాయింట్ సీఈవో పల్లవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పచ్చదనం, పరిశుభ్రతా కోసం అనేక కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్య సమస్యలు దరిదాపునకు రావన్నారు. పరిసరాల శుభ్రతా పాటించకపోతే చెత్తచెదారం, వ్యర్థాలలో సూక్ష్మ క్రీములు, దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరం పేర్కొన్నారు. జాయింట్ సీఈఓ పల్లవి మాట్లాడుతూ కాలనీలు బస్తీలను శుభ్రంగా ఉంచుకోవడానికి యువతీ యువకులు కీలక భూమికను పోషించాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించడానికి స్థానికంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కాలనీలలో మొక్కలు విరివిగా పెంచి కాలుష్యం లేకుండా చేయాలని చెప్పారు. వారంలో ఒకసారి అయినా అరగంట సమయం కేటాయించి కాలనీలతోపాటు తమ పరిసరాలను సైతం శుభ్రం చేసుకోవడానికి సన్నద్ధం కావాలన్నారు. అనంతరం పార్కులోని చెత్తను ఎత్తివేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, ఏడో వార్డ్ బీజేపీ అధ్యక్షుడు ప్రభుప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి కాలనీ, ఎస్బీ కాలనీ, రావి కాలనీ, అలంక్రిత మెడోస్ కాలనీ, హెస్‌బీహెచ్ కాలనీ, ఐటీబీ కాలనీ అధ్యక్షులు అన్వర్, లింగమూర్తి, నర్సింహ, మల్లికార్జున రావు, బోస్, నాగేంద్రపాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలి

- దామోదర్ గుప్తా

సికింద్రాబాద్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని. ఆ పేరు మార్చడం బావ్యం కాదని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఒక ప్రాంతానికో, ఒక సామాజిక వర్గానికో చెందిన వారు కాదని, గాంధీ సిద్ధాంతాలతో ప్రభావితులై మద్రాస్ నగరం నుంచి వేరు చేసి తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని 58 రోజుల పాటు కఠోరమైన నిరాదీక్ష చేశారని దామోదర్‌గుప్తా గుర్తు చేశారు. దీక్షలో 45 రోజుల తర్వాత నోటి నుంచి, ముక్కు నుంచి, చెవుల నుంచి పురుగులు వచ్చినా చలించక అసువులు బాసే వరకు దీక్ష కొనసాగించారని అన్నారు. ఇంతటి అసాధారణ వ్యక్తిత్వం ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తెలుగు విశ్వవిద్యాలయం నుంచి తొలగించడం సమంజసం కాదన్నారు.

టీటీడీ లడ్డూ పవిత్రతను కాపాడాలి

- నేడు నామాలగుండు వేంకటేశ్వర ఆలయంలో ఒకరోజు దీక్ష

బౌద్ధనగర్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ పవిత్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. నామాలగుండు వేంకటేశ్వరస్వామి ఆలయంలో లష్కర్‌జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 25న ఒకరోజు దీక్షను చేపడుతున్నామని సమితి చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు దీక్ష కొనసాగుతుందన్నారు. హిమాయత్‌నగర్‌లోగల టీటీడీ వెంకటేశ్వరస్వామిని మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు దర్శించుకున్నారు. టీటీడీ లడ్డూ ఘటనపైసీబీఐతో విచారణ జరిపించాన్నారు. అక్కడే ఆయనకు దీక్షకు కూర్చున్నారు.

మెట్టుగూడలో సభ్యత్వ నమోదు

చిలకలగూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్‌లో బీజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం, జాయింట్ కన్వీనర్ రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమమం నిర్వహించారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి వారికి సభ్యత్వాలు అందజేయలన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

మారేడుపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇళ్లు కూలిపోగా, వరదకు పంట నష్టం జరిగింది. వరద బాధితులను ఆదుకోవడానికి తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్వర్యంలో వెస్ట్ మారేడుపల్లి, జేబీఎస్ బస్టాండ్ పరిధిలో మంగళవారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో కళాకారులు ఎస్.అక్షయ్, ఏ.రాజు, జి.యాకన్న, ఎండీ సయ్యద్, టి.రాణి, బుగ్గన్న, పద్మ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కార్యక్రమాలలో భాగస్వాములుగా ఉంటాం: తలసాని

మారేడుపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ చేపట్టే కార్యక్రమాలలో భాగస్వాములుగా ఉంటామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను ఎస్సార్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. అక్టోబర్ 4న కౌన్సిల్ కార్యాలయంలో నిర్వహించే సత్యనారాయణ స్వామి వ్రతానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కౌన్సిల్ అధక్షుడు మాణిక్‌రావ్ పాటిల్, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, కార్యదర్శి యాదగిరి, మాజీ అధ్యక్షుడు పార్థసారధి, ఆర్‌సీ కుమార్, కృష్ణదేవ్‌గౌడ్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

జడ్జి నందికొండ నర్సింగ్‌రావుకు పరామర్శ

రాంగోపాల్‌పేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): సిటీ సివిల్‌కోర్టు స్మాల్ కాజెస్ చీఫ్ జడ్జి నందికొండ నర్సింగ్‌రావు మాతృమూర్తి మణెమ్మ సోమవారం రాత్రి కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం ఓల్డ్‌బోయిగూడలోని వారి నివాసానికి వెళ్లి మణెమ్మ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్జి నర్సింగ్‌రావును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లికార్జున్‌గౌడ్, రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అదక్ష్యుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘాల నాయకులు

బీసీ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీఎస్టీలతో సమానంగా బీసీలు కూడా హక్కులు పొందేలా కృషి చేస్తానని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బీసీ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లో బీసీల ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్యే ఐలయ్య మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బీసీ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు న్నా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధానకార్యదర్శి నిరంజన్, బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గోపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షాపులోకి వెళ్లే వచ్చేసరికి వాహనం చోరీ

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపులోకి వెళ్లొచ్చేసరికి దొంగలు ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. ఈ ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శివాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈ నెల 13వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో మార్కెట్ స్ట్రీట్‌కు వచ్చి దుకాణం ఎదుట యాక్టీవా వాహనాన్ని పార్క్‌చేసి మందులు కొనడానికి షాపులోనికి వెళ్లాడు. బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ నెల 21న బాధితుడు మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి: కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం విడిచి విధులు సక్రమంగా నిర్వహించాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. రెండు రోజులు క్రితం మెట్టుగూడ టీ జంక్షన్ వద్ద వైరు పడిపోయిందని ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందని తెలిపారు. విద్యుత్ సిబ్బంది వర్షాల నేపథ్యంలో అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కూలిన పూర్వ జైల్ ఖానా

- భవనం వెనుక భాగంలో కూలిన ఆరు షెట్టర్లు
- ఒకరికి స్వల్ప గాయాలు

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): నిజాం కాలం నాటి భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఒకరికి స్వల్పగాయాలు కాగా మిగతా వారు క్షేమంగా బయటపడ్డారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న వారిని నిర్బంధించాడానికి ఈస్ట్ ఇండియా కంపెనీ అప్పట్లో సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో జైలు ఖానాను నిర్మించింది. 1947లో స్వాతంత్రం రాగానే ఈస్ట్ ఇండియా కంపెనీ దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోగా, అప్పటి నుంచి జైలుఖానా వ్యాపార కేంద్రంగా మారింది. అంతటి చరిత్ర ఉన్న ఓల్డ్‌జైల్ ఖానా వెనుక భాగంలోని ఆరు దుకాణాల స్లాబ్ మంగళవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో కొద్దికొద్దిగా కూలింది. భవనంలోని నాలుగు షెట్టర్లలో టైలరింగ్, మరో రెండు షెట్టర్లలో పూలవ్యాపారులు జీహెచ్ఎంసీకి అద్దె చెల్లిస్తూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి కొద్దికొద్దిగా కూలండతో భవనంలో లోపల ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో కూలిన ఆరు షెట్టర్లను తొలిగించారు.



నోటీసులు ఇచ్చాం: అధికారులు

పురాతన భవనం కావడంతో కూలిపోయే ప్రమాదం ఉందని ఖాళీ చేయాలని అందులోని వ్యాపారులకు నోటీస్‌లు ఇస్తూనే ఉన్నాం. ప్రతి వర్షాకాలం భవనం ఖాళీ చేయాలని నోటిసులు ఇస్తున్నా షాపుల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. అద్దె తక్కువ ఉండటంతో ఖాళీ చేయడానికి వ్యాపారులు నిరాకరిస్తున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: తలసాని

భవనం కూలిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఘటన స్థలాన్ని సందర్శించారు. కూలిన దుకాణాలను పరిశీలించారు. టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 20 కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. బాధిత కుటుంబాలకు తన వ్యక్తిగత సహాయంగా రూ. 20 వేలు అందజేస్తానని అన్నారు.



కూలిన నిజాం కాలం నాటి జైల్‌ఖానా



ఘటనా స్థలంలో బాధితులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని